నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్-మేడ్చల్

13 హైదరాబాద్, గురువారం 7 మార్చి 2024 HYDERABAD




అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

## వినతిపత్రం ఇస్తే..కేసు పెట్టారు

మల్కాజిగిరి, మార్చి 6: ఉచితంగానే ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలంటూ.. బీఆర్ఎస్ శ్రేణులు అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అక్కడికి వచ్చిన అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్ రెడ్డి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులను చూసి కారులోనే కూర్చున్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే వద్దకు వచ్చి విషయం తెలుసుకోవాలి. అయితే కొద్ది సేపటి తర్వాత కారుదిగి వచ్చిన డీసీకి ఎమ్మెల్యే మర్రి వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించారంటూ..ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అల్వాల్ సర్కిల్ కార్యాలయానికి ఉదయాన్నే వెళ్లిన డీసీ శ్రీనివాస్ రెడ్డిని ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విధులకు ఆటకం కలుగజేయడంతో పాటు పౌరుష పదజాలాలతో మాట్లాడటంతో పాటు దూషించారని డీసీ ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## 9,10వ తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం



సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న ఉస్మాన్‌సాగర్ జలాశయం నుంచి నగరానికి నీటి సరఫరా చేసే నీటి కాలువకు హకీంపేట్ ఎంఈఎస్ వరకు భారీ నీటి లీకేజీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 9 శనివారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. 18 గంటల పాటు జరిగే ఈ పనులతో పలు ప్రాంతాల్లో పాక్షికంగా , పూర్తిగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. విజయ్ నగర్ కాలనీ, హుమాయున్ నగర్, కాకతీయ నగర్, అసెంబ్లీ, ఖైరతాబాద్, మల్లేపల్లి, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు.

## మార్మోగిన శివ నామస్మరణ

### కీసరగుట్టలో వైభవంగా మొదలైన బ్రహ్మోత్సవాలు

కీసర, మార్చి 6: కీసర గుట్ట శివ నామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు భవానీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఇదిలా ఉంటే కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసినట్లు ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ వెల్లడించారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మహాశివరాత్రిని పురస్కరించుకుని టీఎస్ఆర్టీసీ గ్రేటర్‌లో ప్రత్యేక బస్సులను నడపనున్నది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆరు రోజుల పాటు 300 ఆర్టీసీ జాతర స్పెషల్ బస్సులను నడుపుతున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. కీసరగుట్టలో కుషాయిగూడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఆర్టీసీ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు కీసరగుట్ట నుంచి నగరంలోని పలు ప్రాంతాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు సహితం సరిపడా ఆర్టీసీ బస్సులను నడుపుతామన్నారు. 8 నుంచి 10 వరకు సీబీఎస్, పటాన్ చెరువు నుంచి ఏడుపాయల, బీరంగుట్ట జాతరకు ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు.

## బర్త్ అండ్ డెత్ స్కాంలో చర్యలు షురూ

### సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ సస్పెన్షన్

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : నాన్ అవెలబులిటీ సర్టిఫికెట్ లేకుండానే బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లను జారీ చేసిన ఘటనలో ఫలక్‌నుమా సర్కిల్ సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణపై కమిషనర్ రోనాల్డ్ రాస్ సస్పెన్షన్ వేటు వేశారు. ఫలక్‌నుమా సర్కిల్ కార్యాలయం నుంచి నాన్ అవెలబులిటీ సర్టిఫికెట్ లేకుండా దాదాపు 80 సర్టిఫికెట్లు జారీ చేశారు. దీనిపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అక్రమాల నిగ్గు తేల్చాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను ఆదేశించారు. దీంతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి నలుగురు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం చార్మినార్ జోన్‌లో నకిలీ బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీపై విచారణ చేపట్టింది. ప్రాథమిక నివేదిక ఆధారంగా సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణపై వేటు వేశారు.





జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ మధుసూదనచారి తదితరులు



బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ముందు ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

# ఉచితం? ఉత్తమాటేనా?




### ఎల్ఆర్ఎస్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

### గ్రేటర్ వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల వద్ద ఆందోళన

### ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్

సిటీబ్యూరో:ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉచితంగానే ఎల్ఆర్ఎస్ పథకం అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, నేతలు డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ ఫీజు ప్రజలపై భారం పడుతుందని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేయాలంటూ బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం, హెచ్ఎండీఏ కార్యాలయంతో పాటు జోనల్, శివారు మున్సిపల్ కార్యాలయాల ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బూటకపు హామీలు ఇచ్చి అధికారంలో వచ్చాక ప్రజలపై భారం మోపే నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. ప్రస్తుత మంత్రులు గతంలో ఎల్ఆర్ఎస్‌పై అనేక రకాల ప్రకటనలు చేశారని, ఫీజు అవసరం లేకుండానే రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటనలు చేశారని, దానిని అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



అమీర్‌పేట్‌లో జరిగిన ధర్నాలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎల్బీ నగర్ జోనల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తదితరులు



కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ముందు జరిగిన నిరసనలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు




ఉప్పల్ సర్కిల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..

# నెలాఖరులోగా ఎల్ ఆర్ఎస్ అసాధ్యం

### లక్షల్లో దరఖాస్తులు.. తక్కువ సిబ్బంది

### ప్రక్రియ పూర్తికి 6 నుంచి 8 నెలల సమయం

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ అంశంలో అధికారుల్లో అయోమయం నెలకొన్నది. ముఖ్యంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన..క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలంటే నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది చాలా కీలకం. ప్రస్తుతం హెచ్ఎండీఏతో పాటు జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల్లో స్థాయిలో తగిన సిబ్బంది అందుబాటులో లేరని, అలాంటి పరిస్థితుల్లో లక్షలాది దరఖాస్తులను మార్చి 31 వరకు పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయాన్ని ప్లానింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో ఉన్న అర్జీలను దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి.. ప్రొసీడింగ్స్ ఇవ్వాలంటే 6–8 నెలల కంటే ఎక్కువ సమయం పడుతుంది. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ విషయంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సాధ్యాసాధ్యాలపై సమీక్ష చేయలేదు. పైగా మార్చి నెలాఖరులోగా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి జారీ చేశారు. అప్పటి నుంచి పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్‌ప్లానింగ్) అధికారులు కసరత్తు మొదలు పెట్టినా.. నిర్ణీత గడువులోగా అసాధ్యమని పేర్కొంటున్నారు.

### 3.44 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు..

7 జిల్లాల పరిధిలో విస్తరించిన ఉన్న హెచ్ఎండీఏ పరిధిలో 47 మున్సిపాలిటీలను మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లోంచి వచ్చిన దరఖాస్తులే 3,44,726 వరకు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు కేవలం 50,025 అర్జీలను హెచ్ఎండీఏ అధికారులు జోన్ల వారీగా పరిశీలించారు. మిగతా వాటిని పరిశీలన చేసి క్రమబద్ధీకరించే పనిని మొదలు పెట్టినా, ప్రస్తుతం ఉన్న సిబ్బందితో ఎంత వేగంగా చేసినా సాధ్యం కాదనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

### సుమారు 25 లక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సుమారు 25 లక్షల వరకు ఉన్నాయి. గ్రేటర్‌కు సంబంధించి దరఖాస్తులను పూర్తిగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు అప్పగించకుండా శివారు ప్రాంతాల్లో ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 30 వరకు ఉన్న మున్సిపాలటీలకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ బాధ్యతలను అప్పగించారు. వీటి పరిధిలోనూ 2–3 లక్షలపైనే ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇలా అన్ని చోట్ల లక్షల్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించడం, క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయడమంటే ఏవిధంగా చూసినా అసాధ్యమనే చెబుతున్నారు. పైగా పార్లమెంట్ ఎన్నికలు జరగాల్సి ఉండటంతో అధికారులు వాటి విధుల్లో ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో 'ఎల్ఆర్ఎస్' ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యమని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**హెచ్ఎండీఏ పరిధిలో ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు**

| జోన్స్ | స్వీకరించిన దరఖాస్తులు | పరిశీలించినవి |
|---|---|---|
| శంకర్‌పల్లి | 73915 | 12193 |
| ఘట్‌కేసర్ | 159672 | 14872 |
| మేడ్చల్ | 30850 | 10058 |
| శంషాబాద్ | 80289 | 12902 |
| మొత్తం | 344726 | 50,025 |




## మార్కెట్‌లోకి.. బీవైడీ సీల్

జూబ్లీహిల్స్: గ్రీన్ మొబిలిటీ సొల్యూషన్‌లను అందించడంలో అగ్రశ్రేణిగా నిలిచిన బీవైడీ సీల్‌కు వరల్డ్ కార్ ఆఫ్ ది ఇయర్‌గా అరుదైన గుర్తింపు లభించినట్లు బీవైడీ ఇండియా ఈవీపీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాల కృష్ణన్ తెలిపారు. ఈ కారు 3.8 సెకన్లలో 0–100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందన్నారు. బుధవారం ఈ కారును మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఎస్‌బీఐహెచ్‌వో ఏజీఎం దినేశ్ గురునాథం, కున్ గ్రూప్ సీఈవో ఆర్. అశోక్, బీవైడీ సేల్స్ హెడ్ జె.రాజ శేఖర్, జీఎం ఎస్.సందీప్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

# వేసవిలో నీటి ఎద్దడి ఉండొద్దు

### విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

### గ్రేటర్ ఉన్నతాధికారుల సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో వచ్చే వేసవి, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో కలిసి పలు అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వేసవిలో నగరవాసులకు ప్రజలకు తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.. ప్రస్తుతం కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలని సూచించారు. వేసవి కాలంతో పాటు రానున్న రంజాన్ నెలను దృష్టిలో పెట్టుకొని వాటర్ ట్యాంకర్లు 24 గంటలు తిరగడానికి అనుమతి ఇవ్వాలని అధికారులకు సూచించారు. మోటార్లు 24 గంటలు నడిచేలా..కరెంటు కోతలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ కి 10 టీఎంసీ ల నీటిని ఉపయోగించుకోవాలని హైదరాబాద్ తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. ఎల్లంపల్లి నీళ్లు సిద్దిపేట , గజ్వేల్ , దుబ్బాకకు ఇవ్వకుండా మొత్తం హైదరాబాద్‌కి తీసుకెళ్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇందులో వాస్తవం లేదన్నారు. వర్షాకాలంలో ముంపు ప్రాంతాలు ఉండకుండా ఆస్తి , ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేసవిలో టి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు చేపట్టామని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ ఉన్నాయని తెలిపారు. 245 స్టాటిక్ టీమ్స్‌తో పాటు 30 డీఆర్ఎఫ్ బృందాలు,147 మొబైల్ టీమ్స్ ఉన్నట్లు చెప్పారు.ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ మెట్రో పాలిటన్ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి కమిషనర్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు సికింద్రాబాద్‌లో

# స్కైవేకు సీఎం శంకుస్థాపన

### 9న మరో స్కైవేకు ముహూర్తం

సిటీబ్యూరో: ఉత్తర తెలంగాణ వైపు రవాణా మార్గాలను మెరుగుపర్చడానికి రెండు ఎలివేటెడ్ కారిడార్లకు(స్కైవే) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురు, శనివారాల్లో సికింద్రాబాద్ అల్వాల్‌లో శంకుస్థాపన చేయనున్నారు. ఒక స్కైవేను జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, మరో స్కైవేను ప్యారడైజ్ నుంచి మేడ్చల్–కండ్లకోయ వెళ్లే మార్గంలో నిర్మించనున్నారు. నగరం నుంచి ఉత్తర తెలంగాణ వైపు వెళ్లేందుకు వీలుగా అత్యాధునిక శైలిలో వీటిని నిర్మించేందుకు హెచ్ఎండీఏ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రెండు స్కైవేలను నిర్మించే మార్గాల్లో రక్షణ శాఖ భూములు పెద్ద మొత్తంలో సేకరించాల్సి ఉండటంతో కేంద్రం నుంచి అనుమతులు రాలేదు. ఇందుకోసం గత కేసీఆర్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేసింది. ఆ ఫలితంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లోనే రక్షణ శాఖ భూములను అప్పగించేందుకు అంగీకరించడంతో రెండు స్కైవేలను నిర్మించేందుకు మార్గం సుగమమైంది. రాజీవ్ రహదారిపై నిర్మించే స్కైవేను 11.3 కి.మీ పొడవు, 6 లేన్ల వెడల్పుతో నిర్మించనున్నారు. దీనివల్ల సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గుతాయి.

# సత్ఫలితాలిస్తున్న ఎస్‌సీఎస్‌సీ సేవలు

### సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల పరిశోధన, మహిళా భద్రత తదితర అంశాల్లో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ)సేవలు సత్ఫలితాలిస్తున్నట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి అన్నారు. బుధవారం కమిషనరేట్‌లో ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు, పలు ఐటీ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీ కారిడార్‌లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని ఐటీ కంపెనీలు తమ సెక్యూరిటీ మార్షల్స్‌లో కొంతమందిని ట్రాఫిక్ నియంత్రణకే కేటాయించాలన్నారు. సాధారణంగా ప్రతి ఐటీ పార్క్‌లో 10వేల నుంచి లక్ష మంది వరకు ఉద్యోగులు ఉన్నారని, అదే స్థాయిలో వాహనాలు సైతం ఉండటం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్నట్లు చెప్పారు. ఉద్యోగుల్లో ట్రాఫిక్, రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంచేందుకు టౌన్ హాల్ మీటింగ్‌లు నిర్వహించే తేదీలను సంబంధిత సంస్థలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ జోయల్ డెవిస్, ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ రమేశ్ కాజా, పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి